క్లుప్తంగా

పేదలందరికీ సంక్షేమ పథకాలు

సి.బెళగల్: అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం సి.బెళగల్ మండలంలోని కె.సింగవరం, కొత్తకోట గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పథకాల వినియోగంపై మండల అధికారులు అవగాహన కల్పించారు. ఎంఈఓ ఆదామ్ బాషా, ఏఓ మల్లేష్‌కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న పాల్గొన్నారు.

చేతులు శుభ్రం చేసుకోవాలి

కల్లూరు: పాఠశాలలో విద్యార్థులు భోజనానికి ముందు చేతులను శుభ్రపర్చుకోవాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య అధికారి హేమలత సూచించారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధి దూపాడు మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అతిసారం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులను నివారించవచ్చునన్నారు.

నాపరాయి లారీల సీజ్

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరులో అక్రమంగా నాపరాయి తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం కోడుమూరులో అక్రమంగా నాపరాయి తరలిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా దాడి చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ డీడీ మాట్లాడుత.. కోడుమూరు నుంచి కర్నూలుకు అక్రమంగా నాపరాయి తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి రూ.లక్ష జరిమానా విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భూమిపూజ

కోడుమూరు రూరల్ : మండలంలోని క్రిష్ణాపురం, మెరుగుదొడ్డి గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి గురువారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ భూమి పూజ చేయనున్నారు. కోడుమూరు – బళ్లారి రోడ్డు నుంచి క్రిష్ణాపురం గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.297లక్షలు, వర్కూరు నుంచి కల్లపరి, పులకుర్తి మీదుగా మెరుగుదొడ్డి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.450లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

ఎంపీడీఓగా సందీప్



సి.బెళగల్: ఎంపీడీఓగా ఈఓఆర్డీ సందీప్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. రెగ్యులర్ ఎంపీడీఓగా ఉన్న ఏసీ రాముడు డిప్యూటేషన్‌పై వెళ్లారు. బుధవారం ఎంపీడీఓగా మండలంలో ఈఓఆర్డీగా పనిచేస్తున్న సందీప్ బాధ్యతలు స్వీకరించారు. దీనితో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

రాముడి విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం




ఆహ్వాన పత్రికను అందిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు

పాణ్యం: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో ప్రతిష్టించే బాలరాముని విగ్రహ ప్రతిష్టకు నెరవాడ గ్రామం వద్ద ఉన్న షష్టి యోగ నాగమునేంద్ర సేవా ఆశ్రమం శ్రీకృష్ణ పీఠం పీఠాధిపతులు పాండురంగానంద భారతి స్వాముల వారికి ఆహ్వాన పత్రిక అందింది. ఈ ఆహ్వాన పత్రికలను బుధవారం రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సభ్యులు కమ్మయ్య, జే.నాగరాజు అందించారు.

కొనసాగుతున్న అక్షింతల వితరణ

కల్లూరు: అయోధ్య రాముడి పవిత్ర అక్షింతల వితరణ కార్యక్రమం కల్లూరులో కొనసాగుతోందని విశ్వహిందూ పరిషత్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ తెలిపారు. బుధవారం సాయంత్రం కల్లూరులోని మాతా మారెమ్మ ఆలయం కేంద్రంగా చుట్టూ ఉన్న జానకినగర్, మహాత్మానగర్, హేమలతనగర్‌లలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

కల్లూరు: ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.3,000లకు పెంచడంతో చిన్నటేకూరు గ్రామానికి చెందిన పెన్షన్ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య ఆధ్వర్యంలో చిన్నటేకూరు గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

పింఛనుదారులకు అండగా ప్రభుత్వం

- పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచిన ఘనత వైఎస్ జగన్‌దే
- 7,870 మందికి ప్రతినెలా రూ.2.33 కోట్ల పింఛను సొమ్ము పంపిణీ
- కొత్త పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఓర్వకల్లు: ఇచ్చిన మాట ప్రకారం పింఛను సొమ్ము విడతల వారీగా పెంచుతూ ప్రభుత్వం లబ్ధిదారుల మోములో సంతోషం నింపుతోంది. గత టీడీపీ హయాంలో 6644 మందికి పింఛన్లు ఇస్తుండగా ప్రస్తుతం 7870 మందికి పింఛన్ కానుకను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పొదుపు లక్ష్మి ఐక్య భవనం ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు రూ.3వేల పింఛన్ సొమ్మును ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు నాగేశ్వరమ్మ చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛను సొమ్మును రూ.3వేలకు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించి సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు.

ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దు

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. టీడీపీ తోక పత్రికలైన ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఏబీఎన్, టీవీ–5 చానలల్లో తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిగట్టుకుని తప్పుడు కథనాలు ప్రచురించడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఈ పత్రికలను, ఛానళ్లను నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, సింగిల్ విండో చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పారంటే చేసి చూపిస్తారు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే అమలుచేసి చూపిస్తారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎంపీపీ శారద పాల్గొన్నారు. మండలంలో కొత్తగా 129 మందికి పెన్షన్ మంజూరు కాగా వారందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి స్కోచ్ అంతర్జాతీయ సంస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవార్డు అందించిందని చెప్పారు. ఎంపీడీఓ రమణమూర్తి, నాయకులు కేశవరెడ్డి, నారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, పెద్ద ఈశ్వరయ్య, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దగా చేసిన చంద్రబాబును జనం నమ్మరు

గడివేముల: డ్వాక్రా రుణాలను రద్దు చేస్తామని చెప్పి మోసం చేసిన చంద్రబాబును మహిళలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కె.బొల్లవరం గ్రామంలో గ్రామస్తులు, పింఛన్‌దారులతో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 600 హామీలతో నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం ఆరు హామీలను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన అనంతరం సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరినీ అదుకున్నారన్నారు. ఇచ్చిన మాట చెప్పిన ప్రకారం రూ.2 వేల నుంచి రూ.3 వేలు పెంచి లబ్ధిదారుల మన్ననలు పొందారని సర్పంచ్ అంజనమ్మ కొనియాడారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, ఈఓపీఆర్‌డీ అబ్దుల్ ఖాలీక్, తదితరులు ఉన్నారు.



హాజరైన పింఛన్ లబ్ధిదారులు



కె.బొల్లవరంలో కేశమ్మబాయికి పింఛన్ అందిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు

మాటకు కట్టుబడిన సీఎం వైఎస్ జగన్



ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో ఒక్కసారి కూడా పింఛన్‌ను పెంచలేదు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగనన్నపైనే మాకు నమ్మకం ఉంది. రానున్న ఎన్నికలలో మరోసారి సీఎంగా జగనన్ననే గెలిపించుకుంటాం.

– చిన్నిబాయి, పింఛన్ లబ్ధిదారు, కె.బొల్లవరం

పండుగలా పింఛన్ల పంపిణీ

పాణ్యం: మండలవ్యాప్తంగా పెంచిన పింఛన్ సొమ్ము, కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయా గ్రామ సచివాలయాల్లో పండుగలా నిర్వహించారు. గురువారం పాణ్యం మండలం గగ్గటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సద్దల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పద్మావతి, సద్దల చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రతినెలా 1వ తేదీన ఠంచనుగా ఇంటివద్దకే పింఛను సొమ్ము అందిస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మరోమారు అండగా నిలవాలని కోరారు. అనంతరం పెంచిన పింఛన్ సొమ్ముతో పాటు 95 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను అందించారు. గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



గగ్గటూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సద్దల శ్రీనివాసరెడ్డి



గూడూరులో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.3వేల పింఛన్

- ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- చంద్రబాబు మాయ మాటలు నమ్మకండి
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- గూడూరు, కె.నాగలాపురంలో పింఛన్ల పంపిణీ

గూడూరు/గూడూరు రూరల్: దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.3వేల పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన, కె.నాగలాపురంలో పెంచిన పింఛన్ కానుక, నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు, టీడీపీ నాయకులు ఓట్ల కోసం మాయ మాటలు, కల్ల బొల్లి కబుర్లు చెపుతున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గతంలో 14 సంవత్సరాలు పాలించిన చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క మంచి పని చేసాడా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 35 లక్షల మందికి నెలకు రూ. వెయ్యి చొప్పున పింఛన్ సొమ్ము అందేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 55 నెలల్లోనే 64 లక్షల మందికి పింఛన్‌ను అందించడం జరుగుతుదంన్నారు. ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ సొమ్మును పెంచుకుంటూ పోతామని ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3,000లకు పెంచారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులను నింపుతున్నామన్నారు. గూడూరులో కొత్తగా పింఛన్లు మంజూరైన 46 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతులమీదుగా నగదు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జే.ఆబేల్, సచివాలయాల మండల, పట్టణ కన్వీనర్‌లు చనుగొండ్ల మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ రాముడు, సుంకులమ్మ గుడి చైర్మన్ ఉమామహేశ్వర మ్మ, నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో పింఛన్ కానుక పంపిణీ

కోడుమూరు రూరల్ : స్థానిక సంతమార్కెట్ మైదానంలో గురువారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విచ్చేస్తున్నారని, ఎమ్మెల్యే చేతుల మీదుగా కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడంతో పాటు, పాత పింఛన్‌దారులకు పెరిగిన రూ.3వేల పింఛన్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. కావున పింఛన్‌దారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని కోరారు. అనంతరం వైఎస్సార్ పింఛన్ కానుక ఉత్సవాలపై ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓ అజయ్‌భాస్కర్, గ్రామ సచివాలయ సిబ్బందితో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

నిజానిజాలు తెలుసుకోకుండా తప్పుడు రాతలా?

గడివేముల: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ కుమారుడు నరసింహారెడ్డికి ఓట్లు ఉన్నాయంటూ ఓ పత్రికలో ప్రచురితమైన తప్పుడు రాతలపై గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి మండిపడ్డారు. బుధవారం బొల్లవరం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని పచ్చపత్రికలు అధికార పార్టీ నాయకులపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. గతేడాది నవంబర్ 17న తమ ఓట్లు తొలగించాలంటూ ఎమ్మెల్యే సతీమణి, కుమారుడు బీఎల్ఓ, రెవెన్యూ అధికారులకు స్వయంగా సంతకాలు చేసి ఫారం–7 దరఖాస్తులు సమర్పించారని, తదనుగుణంగా డిసెంబర్ 17నే వారి ఓట్లను అధికారులు తొలగించారన్నారు. పచ్చ పత్రికలు నిజానిజాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ విషయపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా ఎమ్మెల్యే సతీమణి, కుమారుడు స్వయంగా ఫారం –7 దరఖాస్తులు ఇవ్వడంతో గత డిసెంబర్ 17న వారి ఓట్లను మండలంలో తొలగించామన్నారు. ఈ వివరాలను టీడీపీ వారు మంగళవారం అడగగా ఆన్‌లైన్‌లో తొలగించిన స్టేటస్‌ను వారికి చూపించానన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 39వ వార్డు 102వ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడా కూడా లేని విధంగా ప్రతి గ్రామంలో ఇద్దరు స్పెషలిస్టులు ఏర్పాటు చేసి ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకుని ఏదైనా సమస్య ఉంటే మందులు వాడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పారు. అనంతరం పలువురికి కళ్ల అద్దాలు, కొత్త ఆరోగ్యశ్రీకార్డులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాంబశివరావు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి శ్రీనివాసరెడ్డి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యాం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నెల 31న పులివెందులలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీనివాసరెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడన్నారు. పీడీ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

బాత్రూంలో జారిపడి వృద్ధుడి మృతి

కల్లూరు: ఉలిందకొండ గ్రామానికి చెందిన వ్యక్తి బాత్రూంకు వెళుతూ జారి పడి మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... ఉలిందకొండకు చెందిన కటిక రజ్జా సాబ్ (73) మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళుతూ కాలుజారి బాత్రూం గడపపై పడ్డాడు. అతని తలకు, కుడి కాలికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య జైతున్ బీ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

సి.బెళగల్: మండల రైతులు కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు సాగుచేసుకున్న కంది పంటలను పరిశీలించారు. కాగా పంటలో శనగపచ్చ పురుగును గమనించిన ఏఓ సస్యరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. ఒక లీటరు నీటిలో రెండు మిల్లీ లీటర్ల క్వినాల్‌ఫాస్‌ను, లేదా ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల క్లోరోఫాస్ చొప్పున కలుపుకుని కందిపంటలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కందిలో మంచి పూత రావడానికి ప్లానోఫిక్స్‌ను పంటపై పిచికారీ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ఆర్బీకేను తనిఖీ చేశారు.

ఆర్బీకేల్లో కందుల కొనుగోళ్లు

మండలంలోని ఆర్బీకేలలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసుకున్న కంది పంటల దిగుబడులను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని ఏఓ మల్లేష్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల రైతులు ఆర్బీకేలలో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించాచరు.



గొల్లలదొడ్డిలో కందిపంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

రీసర్వేపై అభ్యంతరాల నమోదుకు గ్రామసభలు

పాణ్యం: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5వ తేదీ ఎస్.కొత్తూరు, కౌలురు, 6న గోరుకల్లు, 8న తమ్మరాజుపల్లె, 9న గోనవరం, 10న చిలకల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వస్తామన్నారు. రీసర్వేలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతులు అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు. ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవచ్చన్నారు.

12న వాలీబాల్ పోటీలు

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో ఈ నెల 12వ తేదీన వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫాదర్ జోసెఫ్ బుధవారం తెలిపారు. గ్రామంలోని దివ్య బాల ఏసు ప్రార్థన మందిరం పండగ సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.7వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు చెప్పారు.ఆసక్తి గల క్రీడాకారులు 95733 20883,73863 73266 ఫోన్ నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కల్లూరు: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని కల్లూరు అర్బన్ 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం వార్డులోని శరీన్‌నగర్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి, అక్కడ అందిస్తున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నాగమద్దిలేటి, శివారెడ్డి, హుస్సేన్ ఆలం, కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం నిర్వహణకు సహకరించండి



కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో చర్చిస్తున్న కె.సింగవరం వాసులు

సి.బెళగల్: మండలంలోని కె.సింగవరం ఎత్తిపోతల పథకం నిర్వహణకు సహకరించాలని ఆ గ్రామ పెద్దలు, రైతులు కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కోరారు. బుధవారం కె.సింగవరం గ్రామ పెద్ద రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు శేషిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు కురువ సుంకన్న, బోయ నాగన్న, తెలుగు పెద్ద నాగేష్ తదితరులు కర్నూలులో కుడా చైర్మన్‌ను కలిశారు. గ్రామానికి చెందిన 415 ఎకరాలకు పంట భూములకు సాగునీటిని అందించే ఎత్తిపోతల పథకం తరచుగా మరమ్మత్తులకు గురవుతుండటంతో నిర్వహణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, పార్టీ పెద్దలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. గ్రామస్తుల వినతిపై సానుకూలంగా స్పందించిన కోట్ల హర్ష తమ పరిధి వరకు సహకారం అందించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు కురువ చిన్న మద్దిలేటి, అనుమన్న, హరిజన మాసుమన్న, బొడ్డన్న, చిన్నరాముడు, తెలుగు నాగన్న తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

కర్నూలు (టౌన్): విద్యార్థులు, యువతీయువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని అందులో రాణించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడాకారులను వైఎస్ఆర్‌సీపీ ప్రోత్సహిస్తుందన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆడుదాం- ఆంధ్ర పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకు సర్కారు క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

సి.బెళగల్: బాలబాలికలు భారతీయ మొదటి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో సావిత్రీబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఓర్వకల్లు : సంఘ సంస్కర్త, భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే దేశానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హై స్కూల్‌లో సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా జ్యోతిరావు, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ఐహెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షురాలు అనీషాపాషా, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ప్రిన్సిపాల్ రామన్, శ్రీనివాసులు, జాషువా తదితరులు పాల్గొన్నారు.



ఓర్వకల్లులో పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

అలాగే ఏపీ మోడల్‌స్కూల్‌లో పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరీ పాఠశాలలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.